# అంచనా

రామారావు ఏకపత్నీ వ్రతుడు!

సీతమ్మలాంటి భార్య, లవకుశుల్లాంటి ఇద్దరు కొడుకులు!

'చిన్న కుటుంబమే చింత లేని కుటుంబం' అనే పాలసీకి కట్టుబడి ఫామిలీ ప్లానింగ్ అమలు పరచి, డిపార్టుమెంటు వారిచ్చిన రెండు ఎడిషినల్ ఇంక్రిమెంట్లూ పుచ్చుకొని, హాయిగా, ఆనందంగా రోజులు గడుపుతున్న అదృష్టవంతుడు

ఎలాంటి దురలవాటు గాని, అవలక్షణం గానీ లేని మనిషి.

ఆడగాలి పడదు. మందు ముట్టడు. సిగరెట్ తాగడు. కనీసం వక్కపొడి అయినా నమలడు.

తోటి ఫ్రెండ్సు అప్పుడప్పుడు రామారావు అలవాట్ల గురించి కామెంటు చేసినా-భావుకుడు, పై పెచ్చు రచయితా

కాబట్టి ప్రిన్సిపుల్‌కు కట్టుబడి ఉండగల గుండె నిబ్బరం రామారావుతో ఉంది.

అంతరాత్మ బోధనలను అతిక్రమించగల ధైర్యం లేదు.

ఇంతటి సత్యవ్రతుడికి పదేళ్ళు యు. డి. గా పనిచేసిన తరవాత హెడ్ క్లార్కుగా ప్రమోషనొచ్చింది.

అందుకు ఎగిరి గంతెయ్య లేదు. కారణం? ఉన్న వూరు వదిలి పెట్టి పోవలసి వస్తుందనే బెంగ.

ఏది ఏమైనా, ఉద్యోగికి దూరభూమి లేదు అనే నానుడికి కట్టుబడి ప్రమోషన్ అంగీకరించాడు.

స్వతహాగా మితభాషి కావటంతో సబార్డినేట్ స్టాఫ్‌కి రామారావు మనస్తత్వం కొత్తగానూ, వింతగానూ అనిపించింది.

పై పెచ్చు రూల్సు మనిషి రామారావ్ !

ఉన్న పదహారు మంది ఆఫీసు స్టాఫ్‌లో యల్టీసి కదిరివేలు చాలా చిత్రమైన వ్యక్తిలా అవుపించాడు రామారావుకి!

కదిరివేలుకి ఒక సీటంటూ ఎలాట్ చేయబడక పోవటం ఆ కారణంగా అతగాడు తోటివారితో పిచ్చాపాటీ కబుర్లు, చెప్పటం, కాలాన్ని వృధా చేస్తూ ఉండటం చూచిన రామారావు మొదట్లో ఆశ్చర్య పోయాడు,

తనా ఆఫీసుకు కొత్తగా ప్రమోషన్ మీద వచ్చాడు.

అందుచేత మందలిస్తే బాగుంటుందో, బాగుండదోని సంశయించాల్సి వస్తూంది.

పైగా, అధికారితో కదిరివేలు చాలా క్లోజుగా మూవ్ అవటం కళ్ళారా చూస్తూ అతని విషయంలో నోరు మెదప లేని వాడే అయ్యాడు రామారావ్.

అయినా, ఇష్ట మొచ్చినప్పుడు ఆఫీసుకు రావటం, రిజిస్టర్లో సంతకం చెయ్యటం, చెప్పా పెట్టకుండా ఆఫీసు విడిచి వెళ్ళడం, దొంగ టి. ఎ. లు రాసుకోవడం లాంటివి చూస్తుంటే రామారావుకి చిర్రెత్తు కొస్తూంది.

మరి కొద్ది రోజులు వోపిక పట్టి వేచి ఉండటమే మంచిదని తీర్మానించుకున్నాడు.

ఆ రోజు –

పదకొండు గంటలకు కదిరివేలు ఆఫీసు కొచ్చి రిజిస్టర్లో సంతకంచేస్తూ – "ఏం సార్! మీ రెప్పు డయినా క్రికెట్ మేచ్ చూశారా? లక్షలాది మంది మక్కువతో చూచే ఆట క్రికెట్, కోట్లాది మంది క్రికెట్ కామెంట్రీ అంటే చెవి కోసుకుంటారు. మరి.. మీ మాటేమిటి? మీరు యస్సంటే మీకో కాంప్లిమెంటరీ పాస్ తెప్పిస్తాను. చెప్పండి, సార్, మొహమాట పడకండి." హుషారుగా అన్నాడు.

అందుకు బదులు పలకని రామారావు – ఆలస్యంగా వచ్చి నందుకు కదిరివేలుకి మెమో ఇవ్వాలనుకున్నాడు.

తలెత్తి అతడి ముఖంలోకి సీరియస్‌గా చూస్తూ, "మిస్టర్ కదిరివేలూ! మీరిలా బాధ్యతా రహితంగా ప్రవర్తించటం నాకు నచ్చలేదు. ఏమంటారు?" నిలదీసి అడిగాడు.

కదిరివేలు కిక్కురు మనకుండా వెళ్ళి తన చైర్లో కూర్చుండి పోయారు.

రామారావుకి ఒళ్ళు మండి నట్టయింది అతగాడి నిర్లక్ష్యవైఖరికి.

మధ్యాహ్నం లంచ్ అవర్లో రామారావు కాంటీన్ కేసి నడుస్తుంటే, యు. డి. క్లార్క్ జగన్నాధం వచ్చి కలిశాడు.

"ఇంకా మీకు ఆఫీసు విషయాలు పూర్తిగా బోధ పడినట్లులేదు, సార్! పద్ధతులను మీరే మార్చుకోక తప్పదు! కదిరివేలు నేమీ అనకండి! ఆ తరువాత మీరే బాధపడవలసి వస్తుంది". చిన్న సలహాలాంటిది ఇచ్చాడు జగన్నాధం.

ప్రశ్నార్థకంగా జగన్నాధం ముఖంలోకి చూచాడు రామారావు.

"కదిరివేలు చాలా ఇన్‌ఫ్లుయన్సు వున్న వాడు సార్! లోకల్‌గా మాంచి పాపులర్ ఫిగర్. కదిరివేలు చెయ్యలేని పనంటూ లేదు. అఖండుడు."

"అంటే?" రెట్టించాడు రామారావ్.

"పై అధికారుల పనులు చేసిపెడుతూ వాళ్ళని మచ్చిక చేసుకుని తన గుప్పెట్లో ఉంచుకుంటాడు. వారి మెప్పుకోసం ఎలాంటి పనైనా సరే చేసేస్తాడు. అందుచేత మీరు అతగాడి విషయంలో చూచీ చూడకుండా ఉండటం మంచిది."

"కేవలం కాకాపట్టి మస్కాకొట్టినంత మాత్రాన ఆఫీసు పని టలాయించి తిరగటం నాకు నచ్చదు."

"మీరు మరీ సత్తెకాలం మనిషిలా అగుపిస్తున్నారు అయ్యగారి ఇంటి కరెంటు బిల్లు కట్టడం దగ్గరనుంచి — అమ్మగారిని, పిల్లలనూ సినీమాహాలుకు తీసుకెళ్ళి టిక్కెట్లు ఇప్పించటం వరకు... రకరకాల పనులు చేసిపెట్టే కదిరివేలును మీరేకాదు; ఎవ్వరూ ఏంచేయలేరు. పైగా మీ మీదే ఆఫీసరుకు లేనిపోనివన్నీ నూరిపోస్తాడు. అందునా మీరు కొత్తగా ప్రమోషను మీద వచ్చారా.... మీ కాన్ఫిడెన్షియల్ రిపోర్టు ఇంతే సంగతులు!" అనేసి రెండు కాఫీ టోకెన్లు తీసుకున్నాడు జగన్నాథం.

ఒక మూలగా కూర్చుని కాఫీ సేవిస్తున్నారిద్దరూ.

"తొందరపడకండి! నిదానంగా ఆలోచించి, ఎలా చేస్తే బాగుంటుందని తోస్తే అలా చెయ్యండి. మీకు నేను సలహా చెప్పేవాడిని కాకపోయినా — ఇదే ఆఫీసులో రెండేళ్ళ

బట్టి ఉంటున్న వాడిని కనుక మీతో యదార్థం చెప్పాను అంతే!" కాఫీ చప్పరిస్తూ మళ్ళీ జగన్నాథమే అన్నాడు.

"టు సేవ్ అవరోన్ స్కిన్ ఫూరుకోవటం మంచి దంటావ్." సాలోచనగా అన్నాడు రామారావు.

అన్యథా శరణం నాస్తి అనే భావనలో రామారావ్ ముఖంలోకి చూశాడు జగన్నాథం.

"బై ద్బై — మీలో బలహీనతల్లాంటి వేవైనా ఉంటే అవలీలగా పసి గట్టేయ గలడు కదిరివేలు. మీరు అతనితో ఎలాంటి సంబంధమూ పెట్టుకోకండి. బి కేర్ ఫుల్!"

"ఇక్కడికొచ్చి ఇన్నాళ్ళయినా, నాకు చక్కెర కార్డు పుట్టలేదు. తాలూకాఫీసు చుట్టూ కనీసం పాతిక సార్లు అయినా ప్రదక్షిణాలు చేసి ఉంటాను. ఆ విషయమే మొన్న కదిరివేలుతో మాట వరసకు అన్నాను. మర్నాడే కార్డు తెచ్చి నా చేతిలో పెట్టాడు."

"చూశారా! మీరు వాడి వలలో పడ్డారన్న మాటే. మిమ్మల్ని మెల్లగా ట్రాప్ చెయ్యగల తిమింగిలం లాంటి వాడు. రేపు మందు పార్టీకి రమ్మంటాడు. ఆ తరవాత మీ మీద ఎక్కేస్తాడు. జాగ్రత్త!"

వింటున్న కొద్దీ రామారావుకి మతి పోతున్నట్లని పిస్తోంది. ఇలాంటి వ్యక్తులు ఉంటారని వినడమే కాని, తన సర్వీసులో తారసపడక పోవటమే అందు క్కారణం!

కాఫీ ముగించి ఇద్దరూ మళ్ళీ ఆఫీసు కేసి నడిచారు.

* * *

గుమాస్తాలలో రామారావుకి అపోజిషన్ పార్టీ తయారయ్యింది.

రామారావు సమక్షంలోనే రకరకాల విసుర్లు విమర్శలు, ద్వంద్వార్థంగా మాట్లాడటం.

జరుగుతున్నదంతా గుడ్లప్పగించి చూడటం మినహా వేరేమీ చెయ్యలేని నిస్సహాయుడవుతున్నాడు రామారావు.

పోనీ ఆఫీసరుకు రిపోర్టిస్తే?

అంతకు మించి వేరే గత్యంతరం లేదనుకున్న రామారావు— ఆఫీసరు కాంపు నించి రాగానే ఒక రోజు ముందుగా అటెండెన్సు రిజిష్టరు తీసుకుని చాంబర్ లోకి వెళ్ళాడు.

"గుడ్ మార్నింగ్, సర్!"

"వాటీజ్ ది మేటర్?" ఆఫీసరు రామారావు ముఖంలోకి చూశారు.

"ఆఫీసు విషయాల గురించి ఎప్పుడు మీతో మాట్లాడదామన్నా వ్యవధి దొరకటం లేదు".

" త్వరగా చెప్పండి మీ ప్రాబ్లమేమిటో? "

తాను నిలుచుని మాట్లాడుతూంటే సభ్యత కోసం కనీసం కూర్చోమని అయినా ఛెయిర్ ఆఫర్ చెయ్యనందుకు మనసులో నొచ్చుకున్నాడు రామారావ్.

" స్టాఫ్ అంతా వచ్చినట్లేనా? " అటెండెన్సు రిజిస్టరు చూస్తూ అడిగాడు.

"ఆ విషయమే మీతో మాట్లాడదామని వచ్చాను. ప్యూను గోవిందు, స్టెనో సంపత్ కుమార్, క్లార్కు కదిరివేలు ఇంకా ఆఫీసుకు రాలేదు, సార్! వాళ్ళు ఆలస్యంగా ఆఫీసుకు రావటం అలవాటై పోయింది".

" గోవిందు మా ఇంటి పనేదో చేస్తున్నాడు. పోతే స్టెనోను మద్రాసు పంపించాను "

" కదిరివేలు మరో పని మీద ఎక్కడికో వెళ్ళి ఉంటాడు. "

"కరెక్టు! అంతే! అవునూ.... నువ్వు గుమాస్తాలను మరీ చెండుకు తింటున్నావట. రూల్స్ ఆర్ ఫర్ ఫూల్సు! కట్టుకున్న పెళ్ళాన్నీ, కన్న పిల్లలనూ మందలించినట్టు తోటి గుమాస్తాల మీద మండిపడి కారాలూ మిరియాలూ నూరితే వాళ్ళు వూరుకుంటారటయ్యా? సూపర్వైజర్ లెవెల్ కి వచ్చాక ఇలాంటివన్నీ తెలుసుకోవాలి, రామారావ్! కాస్త పట్టు విడుపూ ఉండాలి! లేకపోతే వీళ్ళ చేత పనులు చేయించుకోలేం ? మోరోవర్. సబార్డినేట్ స్టాఫ్ చాలా డేంజరస్ పీపుల్. వాళ్ళతో మంచిగా లేకపోతే మన మీద ఆకాశరామన్న ఉత్తరాలు పై వాళ్ళకి వ్రాసి పడేస్తారు. వాటివల్ల అవసరమైన ఎన్క్వయిరీలు వస్తయ్. అప్పుడు జుట్టు

పీక్కుని ప్రయోజనం ఉండదు. అండర్‌స్టాండ్! వాళ్ళతో కొస్త ఎమికబుల్‌గా ఉండు. యూ మే గో."

తల పట్టుకుని తిరిగొచ్చి తన సీటులో కూర్చుండి పోయాడు. రామారావ్.

అసలు ఆఫీసరు దగ్గర కెళ్ళటం తన బుద్ధి తక్కువగా భావించాడు.

"ఏమిటీ. కొత్త కథకేమైనా ప్లాటు దొరికిందా!" తెల్ల కాగితాలు ముందేసుకు కూర్చున్న రామారావుకి కాఫీ అందిస్తూ అడిగింది శ్రీమతి.

"ప్లాటు కాదు ... నా శ్రార్ధం." ఆలోచన చెదిరి పోవడంతో విసుగ్గా జవాబిచ్చాడు.

"కథ పేరే శ్రార్ధమా ఏమిటి? అయినా అలాంటి దిక్కుమాలిన కథలు వ్రాయకపోతే — చక్కగా కాలేజిలో చదివే పిల్లలు ప్రేమించు పోవటమో ? జమీందారు గార బ్బాయి కూలీ పిల్లను పెండ్లాడటమో ? రిక్షా తొక్కే వాడికి సినిమా చాన్సు దొరికి లక్షాధికారి అయిపోవటమో వంటి కథలు వ్రాయకూడదూ? అసలు మీమగ రచయితలకు మంచి సబ్జక్టు ఎన్నుకోవటమే చేత నవదు." బుల్లి ఉపన్యాసం ఇచ్చేసి వంటింట్లో కెళ్ళి పోయింది శ్రీమతి.

మూడ్ పాడై పోవడంతో పాటు ఉన్న మతి కాస్తా పోయినట్టనిపించింది రామారావుకి.

1469
శ్రీకాకుళం



తల బాదుకున్నాడు. జుట్టు పీక్కున్నాడు.

తాను రాయాలనుకున్న ప్లాట్‌లో కథానాయకురాలు తుందు కొడుతుంది. అదే వ్యసనానికి బానిస అవుతుంది చివరకు.

మందు కొట్టే స్త్రీ మనోభావాలు ఎలా ఉంటయ్? అసలు ఆడది మందు కొట్టాల్సిన అవసరం ఏ విధంగా చూపటం?

రకరకాలుగా ఆలోచిస్తున్నా, ఒక సొల్యూషనూ దొరకటం లేదు.

కథ వ్రాయటం ప్రస్తుతానికి వాయిదా వేసి, స్నానం గట్రా చేసి భోజనం పూర్తి చేసుకుని ఆఫీసుకు బయలు దేరాడు.

ఆఫీసు కొచ్చినా రాయాలనుకున్న కథలో కథానాయక పాత్రే మనసులో మెదల సాగింది.

ఆలోచిస్తూ ఉండి పోయాడు.

అనుకోకుండా ఆఫీసు గుమాస్తాల్లో కలకలం బయలు దేరటం గమనించిన రామారావ్ కంగారు పడ్డాడు.

విషయం వెంటనే బోధ పడకపోవడంతో తన గురించే వాళ్ళలా గొణుక్కుంటున్నారేమోని ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సు ఫీలవసాగాడు.

ఒకొక్కరుగా ఆఫీసు హాల్లోంచి బయటికెళ్ళి

వరండాలో రౌండ్లు కొట్టి వచ్చి నవ్వుకుంటున్నారు. చెవులు కొరుక్కుంటున్నారు.

ఎవరో ఆడమనిషి ఆఫీసు కొచ్చిందనేసి గోవిందు వచ్చి చెప్పేవరకూ గుమాస్తాల విన్యాసాలకు అర్థం బోధ పడని రామారావ్ ఆఫీసు ఫైళ్ళు చూడటంలో లీనమైనాడు.

పది నిమిషాలు గడిచాక ఆడమనిషి లోపలికొచ్చి రామారావు టేబుల్ దగ్గరగా నిలుచుంది.

ఫైళ్ళు చూచుకోవటంలో లీనమైన రామారావు ఆమె రాకనే గమనించ లేదు.

"నమస్కారమండీ!"

"ఎవరమ్మా మీరు? ఏం కావాలి మీకు?" అడిగాడు రామారావు తలెత్తి.

"కదిరివేలుగారు లేరాండి?"

"ఇంకా రాలేదు"

"వస్తారా! సెలవేమైనా పెట్టారా, సార్?"

"లీవు లెటరు పంపలేదు. బహుశా లేటుగా వస్తాడేమో?"

"అప్పటి వరకూ వెయిట్ చేయమంటారా?"

"మీ ఇష్టం."

మీ ఆఫీసులో వాళ్ళంతా వింత మృగాన్ని చూచినట్లు నాకేసి చూస్తుంటే.... ఇక్కడ ఉండాలనిపించడం లేదు. మళ్ళీ వస్తానులెండి. నమస్కారం."

ఆమె వెళ్ళిపోతుంటే అటుకేసి తల అయినా తిప్పకుండా ఏదో రాసుకోవటంలో నిమగ్నుడయ్యాడు రామారావు.

ఆమె వెళ్ళిపోవటంతో ఆఫీసులో కలకలం చప్పబడ్డది.

ఒక స్త్రీని చూడగానే మగవారిలో వెకిలి వేషాలు ఎందుకు చోటు చేసుకుంటాయో బోధపడలేదు రామారావుకి.

ఆమె ఎవరో? ఎందుకొచ్చిందో?

చదువుకున్న వారిలోకూడా ఎంతటి అనాగరికత? ఛీ! ఏం మనుష్యులు?

సాటి మనిషిని గౌరవించటం చేతకాని సంస్కార హీనులు... గొణుక్కున్నాడు రామారావ్.

సాయంత్రం ఐదు గంటలు దాటింది.

ఒక్కొక్కరుగా ఆఫీసులో వారంతా వెళ్ళిపోయారు.

రామారావు కూడా బయలుదేరే ప్రయత్నంలో ఉన్నాడు.

ఇంతలో టెలిఫోను మోగింది.

రిసీవరు చేతిలోకి తీసుకుని "హలో" అన్నాడు.

"ఎవరూ? హెడ్ క్లార్కుగారా! నమస్కారమండీ"

ఫోన్లో స్త్రీ పలకరింపుకు అదిరిపడి నమస్కారం. మీ రెవరూ?'' అడిగాడు సౌమ్యంగా.

" నా పేరు రుక్మిణి. "

" నేను... "

" మీరు కృష్ణమూర్తి కారని, రామారావుగారని నాకు తెలుసు.

పొద్దున మీ ఆఫీసుకొచ్చాను. మీతో మాట్లాడింది కొద్ది క్షణాలే అయినా — మీ సభ్యత, సంస్కారం నన్ను కదిలించాయి. అవునూ... మీరొకసారి నా రూముకి రాకూడదూ? "

ఆహ్వానానికి విస్తుపోయాడు రామారావు.

" మీకేమైనా అభ్యంతరమా? మీ రచనలు తరచు నేను పత్రికల్లో చదువుతూ ఉంటాను. రండి! కాస్సేపు సరదాగా కాలక్షేపం చేయచ్చు, హోటల్ అప్సరా రూము నెంబర్ టునాట్ త్రీ! ప్లీజు రండి. మీకోసం వెయిట్ చేస్తూంటాను. "

తన సమాధానంకోసం నిరీక్షించకుండానే ఆమె రిసీవర్ పెట్టేసినందుకు నొచ్చుకున్నాడు రామారావు.

తనను ఎందుకు ఆహ్వానించినట్టు? ఇంతకూ ఎవరామె? వెళ్ళటమా, మానటమా?

ఆలోచిస్తూనే ఇల్లు చేరుకున్నాడు.

స్నానం ముగించి బట్టలు మార్చుకుని సైకిలు మీద హోటలు వెతుక్కుంటూ బయలుదేరాడు.

మనసులో అనేక రకాల ఆలోచనలు! ఆమె ఎవరు? హోటల్ రూమ్‌లో ఎందుకుంది?

సైకిలు దిగి స్టాండువేసి లాక్ చేసి, రూము నెంబరు వెతుక్కుంటూ తలుపు తట్టాడు.

"నాకు తెలుసు మీరు వస్తారు! కాకపోతే కొంచెం లేటైంది అంతే. రండి." తలుపు తెరుస్తూనే ఆహ్వానించి, రామారావు గదిలోకి అడుగుపెట్టగానే గడియ పెట్టింది.

గదిలో ఫోమ్ బెడ్డు. దానిముందుగా టీపాయ్. దాని మీద విస్కీ బాటిలు, సగం మందుతో ఉన్న గాజు గ్లాసూ అగుపించాయి. నిర్ఘాంతపోయాడు.

"ఆశ్చర్యపోతున్నారా? అసలు మీరు వచ్చాకనే ప్రారంభించాల్సింది. నిలబడే ఉన్నారేం... కూర్చోండి." బెడ్ కేసి చెయ్యి చూపింది. ఏం చెయ్యాలో తోచలేదు రామారావుకి. బయటికి వెళ్ళిపోతే... అయినా చూద్దాం అని కుర్చీలో అచేతనంగా కూర్చుండిపోయాడు. నోట మాట రావటం లేదు.

"మీరు కథకులు, భావుకులు కదా.." అంటూ

రెండో గ్లాసులోకూడా విస్కీ పోసి, సోడా కలిపి మగతగా చూస్తూ గ్లాసు అందించింది.

సిగ్గు, బిడియం, పిరికితనం ఆవహించాయి రామారావుని.

తన ఎదుట తాగుతున్న స్త్రీ! తాను రాయాలనుకున్న కథలో హీరోయిన్ గుర్తొచ్చింది వెంటనే.

కాస్సేపు ఇక్కడే కనుక ఉంటే తను రాయదలుచుకున్న కథకు తగిన వాతావరణం చూడవచ్చనిపించింది. ఇంటి కెళ్ళగానే రాత్రికి రాత్రే కథ రాయటం పూర్తి చెయ్యొచ్చు అనుకున్నాడు.

"మీ రలా మవునంగా ఉంటే... నా నిషాకూడా దిగిపోతుంది. ఆ తరవాత గతం గుర్తొచ్చి ఏడవాలనిపిస్తుంది." మరి కొంచెం తాగేసి అంది రుక్మిణి.

"ఆడమనిషి తాగటం నే నింతవరకూ ఎరగను. తమాషా అయిన అనుభూతి." తడబడుతూ అన్నాడు.

మరి కొంచెం తాగేసి పక్కనే ఉన్న బెడ్ మీద వాలిపోయింది రుక్మిణి.

రామారావులో ఏ విధమైన చలనమూ అగుపించలేదు.

ఆమె కళ్ళు రామారావుని కొరుక్కుతినేలా చూస్తున్నయ్.

"క్షమించండి. మీరేమీ అనుకోనంటే."

"మీరే మడిగినా చెపుతాను. ఏదడిగినా ఇస్తాను. కమాన్. ఐయామ్ రెడీ."

"మీ రెందుకిలా..." అర్ధోక్తిలో ఆగిపోయాడు.

"బస్! అంతే కదా! ఈ సమాజంలో అందరూ మీ వంటి శ్రీరామచంద్రులే ఉంటే నా పరిస్థితి ఈ విధంగా దిగజారి ఉండేది కాదు" అంటూ లేచి కూర్చుని, టీపాయ్ మీదున్న బాటిల్ అందుకుని సోడాకూడా కలుపుకోకుండా 'రా' తాగేసింది.

ఎరుపెక్కిన ఆమె కళ్ళల్లోకి చూస్తూండి పోయాడు రామారావు.

"జీవితం గురించి అందరి లాగే నేనూ గొప్పగా ఉండాలని వూహించాను. బి. ఎ. పాసయ్యాను. విధవరాలైన తల్లినీ, గుడ్డి అక్కనూ, చదువుకుంటున్న తమ్ముడినీ పోషించాల్సిన బాధ్యత నా మీద పడ్డది. ఉద్యోగం కోసం ఎక్కే గడపా, దిగే గడపా! ఎన్నో ఇంటర్వ్యూల కెళ్ళాను. నన్ను ఎన్నెన్నో ప్రశ్నలు వేశారు. నా శరీరం తూట్లు పడేట్లు గుచ్చి గుచ్చి చూశారు. వారి ఆకలి చూపుల్లోని భావం నాకు అర్థమైంది. అంతా అవకాశం కోసం చెయ్యి చాచినవారే గాని, ఆదుకున్న వారు వక్కరూ అగుపించలేదు. ఉద్యోగం ఇస్తామని ఆశ పెట్టి నన్ను వంచించారు. అలా చాలా సార్లు జీవి

తంలో మోసపోయాను. అందాకా ఎందుకు? నేను ఉదయం మీ ఆఫీసుకు వచ్చినప్పుడు మీ వాళ్ళు ఎలా ప్రవర్తిం చారో మీకు తెలుసు! మీరు కళ్ళారా చూశారు." చెబు తున్న దల్లా ఆపి, మళ్ళీ తాగాలని చేసిన ప్రయత్నం రామా రావు వమ్ము చేశాడు.

"ప్లీజ్! నన్ను తాగనివ్వండి. లేకపోతే మాట్లాడేందుకు శక్తి చాలదు. మోసపోయాను. కాలు జారాను. నా వాళ్ళకు ముఖం చూపించలేక వారికి శాశ్వతంగా దూరమ య్యాను. రొంపిలో ఇరుక్కున్నాను. ఇటువంటి వ్యర్థ జీవి తాన్ని గడుపుతున్నాను. ఇలా ఒంటరిగా ఉన్న స్త్రీ దగ్గర కొచ్చిన మరో పురుషుడైతే మీలాగ మడి కట్టుకు కూర్చునే వారు కారు. మిమ్మల్ని చూస్తూంటే నాలో గౌరవ భావం కలుగుతూంది. చేతు లెత్తి నమస్కరించాల్సి వస్తూంది. మిమ్మల్ని ట్రాప్ చెయ్యమని కదిరివేలు నన్ను ఉసికొలిపాడు. డబ్బు లిచ్చాడు. మిమ్మల్ని మైలపడేయాలని ప్రయత్నించి ఓడిపోతున్నాను. మీ గురించి తప్పుగా, తక్కువగా అంచనా వేశాను. క్షమించండి. దయచేసి వెళ్ళిపోండి. ప్లీజ్." భోరున ఏడ్చేసింది.

రామారావు కూర్చున్న వాడల్లా లేచి మవునంగా బయటికి నడిచాడు.

[2—12—81 ఆంధ్రప్రభ వారపత్రిక]

సాటిలేని మేటిపనితనం! స్త్రీలపాలిటి నేస్తం!!

ప్రతి ఇంటి వంటింటికి కావలసినది వేలాది గృహిణులు

కోరుకునేది

## "7 స్టార్ మిక్సర్ మరియూ గ్రైండర్"

డిస్ట్రిబ్యూటర్స్: **S. M. S.** ఫర్నిచర్ మార్ట్,

దొరైస్వామి అయ్యంగార్ రోడ్,

(సిండికేట్ బ్యాంకు వద్ద)

చిత్తూరు - 517 001

## TIRUMALA TEXTILE ASSOCIATES

*WHOLESALE CLOTH MERCHANTS*

**3-4-384 Tobacco Bazaar,**

***Phone : 72949*** ***SECUNDERABAD-500 003***

★

*AND BRANCH*

## Venkateswara Textiles

CLOTH MERCHANTS

3-4-304/3 **SECUNDERABAD**-500 003

**Phone : 822092**